సోమవారం 10 మార్చి 2025

తెలంగాణ గీతం

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 • సంచిక : 71 • పేజీలు : 4 • వెల రూ. 4/-

రంగారెడ్డి, నల్గొండ,ఖమ్మం, మెదక్, యాదాద్రిభువనగిరి,సూర్యాపేట,వరంగల్, నాగర్ కర్నూల్, హైదరాబాద్,వికారాబాద్, మహబూబ్నగర్, జనగాం, ములుగు,

విలేకరులు కావలెను

రిపోర్టర్లు కావలెను తెలంగాణలో తెలంగాణ గీతం తెలుగు దినపత్రిక కోసం జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ మరియు మండలాల వారీగా రిపోర్టర్స్ కావలెను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8985188834

"ఆఖరి సమరంలో నాటకీయతకు లోటు లేదు! ఉత్కంఠ తప్పలేదు! స్పిన్నర్ల మ్యాజిక్‌తో, రోహిత్ శర్మ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలవోకగా గెలిచేలా కనిపించిన భారత్.. అనూహ్యంగా చిక్కుల్లో పడింది. ప్రత్యర్థిని 251కే పరిమితం చేసి, ఛేదనలో వికెట్ కోల్పోకుండా సునాయాసంగా వంద దాటేసిన జట్టు ఒక్కసారిగా కుదుపునకు గురైంది. చకచకా మూడు వికెట్లు కోల్పోయిన తరుణాన సింగిల్స్ తీయడమే కష్టంగా మారగా.. శ్రేయస్ ఆపద్బాంధవుడే అయ్యాడు. తీవ్ర ఒత్తిడిలో అక్షర్ చేసిన 29, హార్దిక్ కొట్టిన 18, రాహుల్ అజేయ 34 కూడా అంతే అమూల్యమైనవి. టోర్నీ ఆద్యంతం ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన టీమ్‌ఇండియా.. అజేయంగా కప్పునందుకుంది.

11

సాధించాం!

రసవత్తర ఫైనల్లో కివీస్‌పై విజయం

భారత్‌దే ఛాంపియన్స్ ట్రోఫీ.. చెలరేగిన రోహిత్.. రాణించిన శ్రేయస్

స్పిన్నర్ల విజృంభణ జూ సత్తా చాటిన రోహిత్.. భారత్‌కు - రూ. 19.4 కోట్లు.. న్యూజిలాండ్‌కు - రూ. 9.7 కోట్లు

బీసీలు ఎదగకుండా

అడ్డుకునే కుట్ర

- 42 శాతం రిజర్వేషన్లను ఆదిలోనే అడ్డుకునే ప్రయత్నాలు
- అఖిలభారత పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపితే మోదీ మెడపై కత్తి పెట్టినట్లే.. బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది
- మా సర్వే తప్పని ఏవిధంగా చెబుతున్నారో పక్కా ఆధారాలతో రావాలన్నాం.. మా సవాల్ స్వీకరించకుండా బీజేపీ, బీఆర్ఎస్ తప్పించుకుంటున్నాయి

3

అభ్యర్థిత్వం అనూహ్యం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి, శంకర్‌నాయక్

- ఎమ్మెల్యే కోటా అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం
- ఒక సీటు మిత్రపక్షం సీపీఐకి కేటాయింపు
- అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ సామాజిక న్యాయం
- ఎస్సీ, ఎస్టీతోపాటు మహిళకు సీటు కేటాయింపు
- అనూహ్యంగా తెరపైకి రాములమ్మ పేరు

హైదరాబాద్/న్యూఢిల్లీ/నల్లగొండ

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 పార్టీలూ అనూహ్యంగా అభ్యర్థిత్వాలను ప్రకటించాయి! కాంగ్రెస్ తన అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్‌లను ప్రకటించింది! ఇక, ఎప్పటి నుంచో అధ్యక్షా.. అనాలని కోరుకుంటున్న దాసోజు శ్రవణ్‌ను బీఆర్ఎస్ ఎంపిక చేసింది! మిత్రపక్షం సీపీఐకి కాంగ్రెస్ ఇచ్చిన సీటులో నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది. ఈసారి విశేషం ఏమిటంటే.. నల్లగొండ జిల్లా జాక్‌పాట్ కొట్టడం! ఆ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్సీలు కాబోతుండడం..! కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠకు - మిగతా3లో

నేటి నుంచే పార్లమెంటు

- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు లోక్‌సభ ఆమోదం కోరనున్న అమిత్ షా
- మణిపూర్, వక్ఫ్ బిల్లుపై సర్కారును నిలదీయనున్న ప్రతిపక్షాలు
- నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రంపైనా ఆందోళన

2

డీలిమిటేషన్, నిర్బంధ హిందీ అమలుపై

కేంద్రాన్ని నిలదీయాలి

- నియోజవర్గాల పునర్విభజన వల్ల నష్టపోయేదీ తమిళనాడు మాత్రమే కాదు
- బాధిత రాష్ట్రాల ఎంపీలను కలుపుకొని వెళ్లాలి
- డీఎంకే ఎంపీలకు స్టాలిన్ దిశానిర్దేశం

ఈడీ వర్సెస్ సీఐడీ!

- ఆధారాలేవన్న సీఐడీ.. కోర్టుకు చేరిన వ్యవహారం
- ఆధారాలున్నాయి.. కేసు మూసేయవద్దన్న ఈడీ
- సీఐడీ తీరుపై హైదరాబాద్ సీపీ అసహనం
- కేసును మళ్లీ తెరవాలంటూ డీజీపీకి లేఖ

హైదరాబాద్

ఆ రెండూ నేరస్థుల పాలిట సింహస్వప్నాలుగా పేరొందిన విభాగాలే..! ఒకటి నేరాలపై రాష్ట్రస్థాయిలో అత్యున్నత దర్యాప్తు సంస్థ సీఐడీ అయితే.. రెండోది జాతీయ స్థాయిలో మనీల్యాండరింగ్, విదేశాలతో అక్రమ లావాదేవీలపై దృష్టి సారించే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)..! ఇప్పుడు ఈ రెండు విభాగాల మధ్య ఓ ఆర్థిక నేరానికి సంబంధించి పంచాయితీ మొదలైంది. ఎలాంటి ఆధారాల్లేవని, కేసును మూసివేయాలని సీఐడీ పట్టుబడుతుండగా.. ఆధారాలున్నాయి, సీఐడీ పునరాలోచించుకోవాలంటూ ఈడీ చెబుతోంది. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ కూడా సీఐడీ నిర్ణయాన్ని తప్పుబట్టడం గమనార్హం..! 2010లో ఉమ్మడి ఏపీలో ఫార్మెక్స్ ఇండియా కంపెనీ లిమిటెడ్(ఎఫ్ఐసీఎల్) గ్లోబల్ డిపాజిటరీ రిసిప్ట్స్(జీడీఆర్) కేసు సంచలనం సృష్టించింది. రూ.370 కోట్ల మేర కుంభకోణం జరిగినట్లు అప్పట్లో దర్యాప్తు అధికారులు - మిగతా3లో

సెలవు లేదన్న హెడ్మాస్టర్.. లెక్కల టీచర్ ఏం చేశారంటే?

భువనేశ్వర్

తీవ్ర అనారోగ్యం పాలైన ఓ ఉపాధ్యాయుడు సెలవు కోసం పెట్టుకున్న దరఖాస్తును ప్రధానోపాధ్యాయురాలు తిరస్కరించారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సెలవివ్వడం కుదరదంటూ తెగేసి చెప్పారు. పాపం ఆ ఉపాధ్యాయుడు విధిలేక చేతికి ఐవీ డిప్ సెలైన్ పెట్టుకునే విధులకు హాజరయ్యారు. ఆయన ఆరోగ్యం విషమించడం చూసి తోటి వారే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన ఒడిశాలోని బొలంగీర్‌లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. బొలంగీర్ ప్రభుత్వ పాఠశాలలో విజయలక్ష్మి ప్రధాన్ హెడ్మాస్టర్ కాగా, ప్రకాశ్ భోయి గణితం టీచర్. ఇటీవల తన తాత అంత్యక్రియల కార్యక్రమానికి హాజరైన అనంతరం ప్రకాశ్ ఆరోగ్యం దెబ్బతింది. విధులకు హాజరు కాలేనందున, సెలవు ఇప్పించమంటూ ఆయన ప్రధానోపాధ్యాయినికి విజ్ఞప్తి చేశారు. పరీక్షల సమయం కాబట్టి, మ్యాథ్స్ టీచర్ అవసరం ఎంతో ఉంటుందని చెబుతూ ఆమె ఆ వినతిని తిరస్కరించారు.

అయితే, ఎన్ని సార్లు కోరినా హెడ్మాస్టర్ వినిపించుకోకపోవడంతో ప్రకాశ్ భోయి చేతికి సెలైన్ పెట్టుకునే విధులకు వచ్చారు. ఆయన పరిస్థితి చూసి తోటి టీచర్లే ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పటన్‌గఢ్ బ్లాక్ విద్యాధికారి(బీఈవో) ప్రసాద్ మాఝి

స్పందించారు. కాజువల్ లీవ్ కోసం ప్రకాశ్ భోయి పంపించిన దరఖాస్తును ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ ప్రధాన్ ఎందుకు తిరస్కరించారనే విషయమై విచారణ చేపట్టామన్నారు. ఆమెదే తప్పని తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బీజేపీ కోవర్టులను ఎప్పుడు తప్పిస్తారు?

న్యూఢిల్లీ

గుజరాత్ కాంగ్రెస్‌లోని కొందరు నేతలు బీజేపీ కోసం పనిచేస్తున్నారని, అవసరమైతే 30-40 మంది నాయకులపై వేటు వేసేందుకు వెనుకాడేది లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఇటు బీజేపీలోనే కాకుండా సొంత పార్టీ నేతల్లోనూ చర్చ జరుగుతోంది. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ సింగ్ (%ణఱస్త్రఱఱయుఖుఖ ూఱఅస్త్రష్ట%) ఆసక్తికరమైన రీతిలో స్పందించారు. పార్టీ కోవర్టులపై చర్య తీసుకోవాలని కోరారు. "కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీకి పనిచేస్తున్న వారిని రాహుల్ గాంధీ ఎప్పుడు బహిష్కరిస్తారు?" అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

ఆనాటి అనుభవం..

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను ఒకసారి గుజరాత్ ప్రచారానికి వెళ్లానని, అప్పుడు తనకు ఒక అనుభవం ఎదురైందని ఈ సందర్భంగా దిగ్విజయ్ చెప్పారు. గుజరాత్ ప్రచారానికి వెళ్లినప్పుడు అక్కడ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు వ్యతిరేకంగా తనను మాట్లాడవద్దని, అలా చేస్తే హిందువులు మనస్తాపానికి గురికావచ్చని సూచనలిచ్చారని దిగ్విజయ్ తెలిపారు. బీజేపీ ఐడియాలజికల్ మెంటర్ ఆర్ఎస్ఎస్ పైనా ఆయన విమర్శలు గుప్పించారు. మతం పేరుతో హిందువులను ఆర్ఎస్ఎస్ వంచిస్తోందని చెప్పారు. ఆర్ఎస్ఎస్‌కు హిందువులంటే గౌరవం లేదన్నదే నిజమని అన్నారు. వేలాది సంవత్సరాల క్రితం హిందూ ఆధ్యాత్మిక నేతలు స్థాపించిన శంకరాచార్యుల సంప్రదాయం ఈనాటికీ కొనసాగుతోందని, ఈ

శంకరాచార్యుల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను సపోర్ట్ చేసినవారెవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు.

కోవర్టులపై రాహుల్ ఏమన్నారు

గుజరాత్ పర్యటనలో భాగంగా శనివారం అహ్మదాబాద్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. "మనలో కొందరు నేతలు రహస్యంగా బీజేపీ కోసం పనిచేస్తున్నారు. వారెవరో మనం వడపోయాలి. లేకుంటే రాష్ట్ర ప్రజలు మనల్ని విశ్వసించరు. నాతో సహా అందరం రాష్ట్ర ప్రజల్లోకి వెళ్లాలి. వారు చెప్పేది వినాలి. నా నుంచి ఏమాశిస్తున్నారు.. వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్ కోసం మనం ఏం చేస్తామో వారికి తెలియాలి" అని చెప్పారు. ప్రజలు బీజేపీ వలలో చిక్కుకున్నారని, గత 20-25 ఏళ్ల బీజేపీ విజన్ విఫలమైందని, కాంగ్రెస్ తేలికగా కొత్త విజన్ అందించగలదని తెలిపారు.

నేటి నుంచే పార్లమెంటు

న్యూఢిల్లీ

పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలు ఉన్నాయి. అధికార బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మ?ధ్య తొలి రోజు నుంచే వాగ్యుద్ధాలు జరగనున్నాయి. హింసాకాండతో అతలాకుతలమైన మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనకూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారమే లోక్‌సభ ఆమోదముద్ర కోరనున్నారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మణిపూర్‌కు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టబోతున్నారు. ఇక ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బిల్లు కూడా ఈ సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు రానుంది. మణిపూర్‌లో రెండేళ్లుగా జరుగుతున్న హింసను అదుపు చేయలేక.. గత నెలలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌తో రాజీనామా చేయించి, రాష్ట్రపతి పాలన విధించాల్సి రావడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మణిపూర్‌లో హింసాకాండ ఆగకపోవడంపై సర్కారును నిలదీయనున్నాయి. మరోవైపు వక్ఫ్ బిల్లును పరిశీలించేందుకు వేసిన సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ)లో తమ అభ్యంతరాలను తిరస్కరించి కేవలం ఎన్డీయే సభ్యుల ఆమోదంతో బిల్లుకు ఆమోదముద్ర వేసినందుకు ప్రతిపక్ష సభ్యులు గత సమావేశాల్లోనే గందరగోళం సృష్టించారు. ప్రతిపక్షాలు ఎంత గొడవ చేసినా సాధ్యమైనంత త్వరలో వక్ఫ్ బిల్లును చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఇండియా కూటమి పార్టీలన్నీ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించేందుకు వ్యూహ రచన చేస్తాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రకటించారు. సోమవారం రాజ్యసభలో రైల్వే సవరణ బిల్లు, సహకార సంఘాల్లో పనిచేసే వ్యక్తులకు తగిన శిక్షణను అందించేందుకు త్రిభువన్ సహకారీ బిల్లును కూడా ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రం ద్వారా హిందీని దక్షిణాదిపై రుద్దడం, భారత్‌పై అమెరికా టారిఫ్‌లు విధించడంపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపట్టరాదని డీఎంకే సహా పలు పార్టీలు డిమాండ్ చేయనున్నాయి.

ఉప రాష్ట్రపతి జగదీప్ దన్కర్ త్వరగా కోలుకోవాలి: ప్రధాని

న్యూఢిల్లీ

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ దన్కర్ త్వరలో కోలుకోవాలని ప్రార్థించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. జగదీప్ అస్వస్థతకు గురికావడంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రితో చికిత్స అందిస్తున్నారు. ఈరోజు(ఆదివారం) తెల్లవారుజామున దన్కర్ కు ఛాతీలో నొప్పి రావడంతో ఎయిమ్స్ కు తరలించి అత్యవసర చికిత్స అందించారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లి దన్కర్ ను పరామర్శించారు. దన్కర్ ఆరోగ్యం గురించి అక్కడ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దన్కర్ త్వరగా కోలుకోవాలని మోదీ ఆకాంక్షించారు.రావాలని ప్రార్థించినట్లు మోదీ తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. కాగా, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఆయనకు ఛాతి నొప్పితో బాధపడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో, తెల్లవారుజామున 2 గంటలకు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (%ూ××మీ%)కు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో ఆయనకు చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతానికి ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యబృందం తెలిపింది. ఇక, ధన్కర్ అస్వస్థత విషయం తెలిసిన వెంటనే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. ఎయిమ్స్‌కు వెళ్లి ఆయనను పరామర్శించారు.

డీలిమిటేషన్, నిర్బంధ హిందీ అమలుపై కేంద్రాన్ని నిలదీయాలి

చెన్నై

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్), జాతీయ విద్యావిధానంపేరుతో రాష్ట్రంలో హిందీని నిర్బంధంగా అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలపై కేంద్రంతో అమీతుమీకి డీఎంకే సిద్ధమవుతోంది. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పాలకపక్షాన్ని నిలదీయాలని ఆ పార్టీ ఎంపీలు నిర్ణయించారు. చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అరివాలయంలో ఆదివారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన ఆ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించారు. నియోజవర్గాల పునర్విభజన వల్ల నష్టపోయేదీ తమిళనాడు మాత్రమే కాదని.., ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఒడిస్సా, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాల సంఖ్య బాగా తగ్గే అవకాశాలున్నాయని, ఈ రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని సమావేశంలో స్టాలిన్ సూచించారు. డీఎంకే అన్యభాషలకు వ్యతిరేకం కాదనే విషయాన్ని పార్లమెంటు ఉభయసభల్లో కుండబద్దలు కొట్టినట్టు ప్రకటించాలని పేర్కొన్నారు. ఏ భాషను నిర్బంధంగా అమలు చేయకూడదని డీఎంకే దశాబ్దాల తరబడి చెబుతున్న విషయాన్ని అన్ని పార్టీల ఎంపీలకు సులువుగా అర్థమయ్యే పదజాలంతో డీఎంకే ఎంపీలు వివరించాలన్నారు. త్రిభాషా విద్యావిధానం గురించి సభ్యులు ఆచితూచి మాట్లాడాలని, తమ వాదనలను సమర్థవంతంగా వినిపించాలన్నారు. రాష్ట్రంలో నిర్బంధ హిందీని అమలు చేయడానికిగాను....జాతీయ విద్యావిధానాన్ని ఆమోదించకుంటే నిధులు రావని కేంద్రం బెదిరిస్తున్న విషయాన్ని కూడా సభలో ప్రస్తావించాలని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు దిశగా స్టాలిన్ చేపడుతున్న చర్యలను సమర్థిస్తూ ఎంపీలు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు. నిర్బంధ హిందీని అమలు చేసి తమిళభాషకు ముప్పు కలిగించడానికి కేంద్రం చేస్తున్న కుట్రను అడ్డుకునేలా, నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించేలా ఉభయ సభల్లో పటిష్టమైన వాదనలను వినిపిస్తామని ఈ విషయంలో పార్టీ ఎంపీలందరూ ఏకతాటిపై నడుస్తామని మరొక తీర్మానం కూడా చేశారు.

రైల్వే ప్రయాణికులకు గమనిక.. ప్లాట్‌ఫామ్‌పై ఎంట్రీకి కొత్త రూల్!

న్యూఢిల్లీ

రైలులో ప్రయాణించాలనుకునే వారు ఇకపై కన్ఫార్మ్ టికెట్ ఉంటేనే ప్లాట్‌ఫామ్ పైకి వెళ్ల గలుగుతారు. పైలట్ ప్రాజెక్టు కింద న్యూఢిల్లీ, ఆనంద్ విహార్, సూరత్, వారణాసి, అయోధ్య, పాట్నా రైల్వే స్టేషన్లలో ఈ వ్యవస్థను తక్షణమే అమల్లోకి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణీకులు రైల్వే శాఖ ఆదేశాలను పాటించాలని సూచనలు చేశారు. తాజాగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ నియంత్రణపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా 60 ప్రధాన రైల్వే స్టేషన్లలోని అనధికార ఎంట్రీ పాయింట్లను మూసివేసి.. కన్ఫార్మ్ టికెట్లు ఉన్న ప్రయాణీకులను మాత్రమే ప్లాట్‌ఫామ్‌లపైకి అనుమతించాలని నిర్ణయించారు. మహా కుంభమేళా సందర్భంగా దేశంలోని 60 రైల్వే స్టేషన్లలో తాత్కాలికంగా వెయింటింగ్ రూములు ఏర్పాటు చేశారు. న్యూఢిల్లీ, సూరత్, పాట్నాల్లో రద్దీని నియంత్రించడంలో ఇవి ఎంతో ఉపయోగపడ్డాయి. రైలు విచ్చిన తర్వాతే ప్రయాణికులను ప్లాట్‌ఫామ్‌పైకి అనుమతించారు. ఇదే పద్ధతిని ఇప్పుడు శాశ్వతంగా అమలు చేయాలని నిర్ణయించారు. 60 స్టేషన్లలో తాత్కాలికంగా నిర్మించిన వెయిటింగ్ రూములను శాశ్వతంగా ఉపయోగపడేలా మార్చబోతున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో రైళ్ల సామర్థ్యం మేరకే టికెట్లు విక్రయిస్తారు. ఈ స్టేషన్లలో రైల్వే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ కూడా ఉంటుంది. కుంభమేళా సందర్భంగా ఢిల్లీ స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై రైల్వే శాఖ ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది.

అమెరికా 'టారిఫ్ టెర్రరిజం'...

రాందేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు

నాగపూర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై యోగా గురువు, ఎఫ్ఎంసీసీ జెయింట్ పతంజలి సహ-వ్యవస్థాపకుడు రాందేవ్ బాబా మండిపడ్డారు. టారిఫ్ టెర్రరిజాన్ని ట్రంప్ ప్రోత్సహిస్తున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాలు ఎంతైతే టారిఫ్ విధిస్తారో తామూ అంతే టారిఫ్ విధిస్తామంటూ 'రెసిప్రోకల్ టారిఫ్'లను ట్రంప్ విధిస్తుండంపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు సరికొత్త మేథో వలసరాజ్యం శకాన్ని సృష్టిస్తూ పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

"ఇదొక సరికొత్త మేథో వలసరాజ్య శకం. డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా, ఆయన టారిఫ్ టెర్రరిజంలో ప్రపంచ రికార్డు సృష్టిస్తుంటారు. పేదలు, అభివృద్ధి చెందిన దేశాలను బెదిరిస్తూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుంటారు. ప్రపంచాన్ని కొత్త శకంలోకి తీసుకెళ్తుంటారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో ఇండియా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారతదేశాన్ని పటిష్ట దేశంగా తీర్చిదిద్ది, ఇలాంటి విధ్వంసక శక్తులకు గట్టి జవాబిచ్చేందుకు భారతీయులంతా సమష్టిగా నిలబడాలి" అని మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా రామ్‌దేవ్ బాబా అన్నారు. కొన్ని శక్తివంతమైన దేశాలు ప్రపంచాన్ని విధ్వంసం దిశగా తీసుకెళ్లాలని కోరుకుంటున్నందున భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.

అమెరికాలో హిందూ ఆలయం విధ్వంసంపై..

కాలిఫోర్నియాలోని హిందూ ఆలయాన్ని విధ్వంసం చేసిన ఘటనను రామ్‌దేవ్ బాబా ఖండించారు. ఈ తరహా మతపరమైన ఉగ్రవాదానికి కళ్లెం వేసేందుకు ఇండియా చొరవ తీసుకోవాలన్నారు. రెలిజియస్ టెర్రరిజంతో యావత్ ప్రపంచం ఇబ్బందులు ఎదుర్కొంటోందని, దీనికి అన్ని దేశాల అధిపతులు ఒక పరిష్కారం కనుగొనాలని, ఈ దిశగా ఇండియా తగిన చొరవ చూపించాలని సూచించారు.

ఔరంగజేబుది దోపిడీల కుటుంబం

మొఘల్ చక్రవరి ఔరంగబేబ్‌కు సంబంధించిన అడిగిన ఒక ప్రశ్నకు ఆయన ఎప్పుడూ భారత ప్రజల ఆరాధ్యనీయుడు కాదని సమాధానమిచ్చారు. "ఆయన దోపిడీల కుటుంబానికి చెందిన వాడు. బాబర్ కానీ ఆయన కుటుంబం కానీ ఇండియాను దోచుకునేందుకు వచ్చారు. వేలాదిమంది మన మహిళలను వాళ్లు చిత్రహింసలు పెట్టారు. వాళ్లు మన ఐడల్స్ కాదు. ఛత్రపతి శివాజీ మనకు ఆరాధ్యుడు" అని రాందేవ్ బాబా చెప్పారు.

అభ్యర్థిత్వం అనూహ్యం

-మొదటిపేజీ తరువాయి

తెర పడింది. అయితే అనూహ్యంగా పార్టీ ఫైర్ బ్రాండ్ విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, సుదీర్ఘకాలంగా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లను పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. ఒక సీటును మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. ఈ మేరకు ప్రతిపాదనను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు) ప్రకటించారు. మొత్తం ఐదు సీట్లకు ఎన్నికలు జరుగుతుండగా.. పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి నాలుగు సీట్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్.. అందులో ఒకటి మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మిత్రధర్మంలో భాగంగా ఆ పార్టీకి ఇచ్చింది. మొత్తంగా ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీతోపాటు ఒక మహిళకు అవకాశం కల్పించింది.

రేవంత్‌రెడ్డి సూచించిన అభ్యర్థులకే!

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా తనకు కావాల్సిన వారికి దక్కించుకున్నారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అద్దంకి దయాకర్‌కు సరైన సమయంలో అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రస్తావించారు. మిగిలిన ఇద్దరు అభ్యర్థుల ఎంపికలోనూ ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించారని అంటున్నారు. వాస్తవానికి అభ్యర్థుల పేర్లను ఖరారు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఉదయమే ఢిల్లీకి రావాల్సి ఉంది. అయితే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అందుబాటులో లేకపోవడంతో చివరి నిమిషంలో వారు పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లోనే అభ్యర్థుల ఖరారుకు సంబంధించిన చర్చలు జరిపారు. ఆ మేరకే కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. కాగా, ఈ దఫా ఓసీలకు సీటు కేటాయించొద్దని అధిష్ఠానం నిర్ణయించడంతో ఎమ్మెల్సీ సీటుపై ఆశలు పెట్టుకున్న ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి నిరాశ ఎదురైంది. ఆయనతోపాటు రేసులో చివరిదాకా ఉన్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీనియర్ నేత జెట్టి కుసుమ్‌కుమార్‌కూ నిరాశే ఎదురైంది.

ఎట్టకేలకు అద్దంకికి అవకాశం..

తెలంగాణ ఏర్పడిన దగ్గర్నుంచీ అద్దంకి దయాకర్‌ను ఊరిస్తూ వస్తున్న చట్టసభల్లో ప్రాతినిథ్యం.. ఎట్టకేలకు దక్కనుంది. 2014, 2018 ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దయాకర్ స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2023 ఎన్నికల్లో తుంగతుర్తి సీటును మందుల సామేలుకు ఇచ్చిన అధిష్ఠానం.. అద్దంకికి ఎమ్మెల్సీ సీటు హామీ ఇచ్చింది. ఇటీవల రెండు సీట్లకు జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటును తొలుత అద్దంకి దయాకర్‌కు ఖరారు చేసినా.. చివరి క్షణంలో అభ్యర్థిని మార్చేసింది. ఈ దఫా ఎమ్మెల్సీ సీటు కూడా చివరి వరకూ సస్పెన్స్‌గానే నిలిచింది. ఈ సీటును మాదిగకు కేటాయించాలా.. లేక మాలకు కేటాయించాలా అన్న తర్జన భర్జన నడిచింది. ఒక దశలో మాదిగ, మాల సామాజిక వర్గాలకు చెరోటి కేటాయించాలన్న అంశంపైనా చర్చ నడిచింది. అయితే సీపీఐకి ఒక సీటు కేటాయించడంతో రెండు సామాజిక వర్గాల్లో ఒక దానికే సీటు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌తో ఫోన్ ద్వారా చర్చలు జరిపిన అధిష్ఠానం.. చివరికి అద్దంకి దయాకర్ పేరును ఖరారు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతోనే అద్దంకి దయాకర్‌కు అభ్యర్థిత్వం లభించిందని పార్టీ వర్గాలు తెలిపాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌కు చెందిన దయాకర్ అద్దంకి దయాకర్ విద్యార్థి దశ నుంచి సామాజిక, విద్యార్థి ఉద్యమాల్లో పనిచేశారు.

అధిష్ఠానం ఆశీర్వాదంతో విజయశాంతి

తొలుత వెండితెరపై, ఆ తర్వాత రాజకీయాల్లోనూ ఫైర్‌బ్రాండ్‌గా కొనసాగిన విజయశాంతి.. ఎమ్మెల్సీ అభ్యర్థుల రేసులో అనూహ్యంగా తెరపైకి వచ్చారు. ఇటీవల ఆమె అధిష్ఠానం పెద్దలను కలిసి తన అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేసుకున్నారు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సోనియా సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసలో చేరిన విజయశాంతి.. 2018 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరారు. అయితే ఆ పార్టీ రాజకీయాల్లో ఇమడలేక 2023 ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఆమె చేరే సమయంలోనే పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ సీటు ఇస్తామని అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే హామీ ఇచ్చారు. అధిష్ఠానాన్ని కలిసిన విజయశాంతి ఈ హామీని గుర్తు చేసినట్లు చెబుతున్నారు. ఈ హామీతోపాటు బీసీ మహిళ కోటాలో విజయశాంతిని అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించింది. అయితే విజయశాంతిని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమె మూలాలకు సంబంధించిన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2005లో తల్లి తెలంగాణపార్టీని స్థాపించిన తొలిరోజుల్లో తన స్వస్థలం ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెంగా విజయశాంతి ప్రకటించుకున్న సంగతి తెలిసిందే.

సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన శంకర్‌నాయక్

కేతావత్ శంకర్‌నాయక్.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎదిగారు. ప్రస్తుతం నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న శంకర్‌నాయక్.. జానారెడ్డికి సన్నిహితుడిగా పేరుంది. దీనికితోడు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ ఆయన అభ్యర్థిత్వానికి మద్దతుగా నిలిచారు. పార్టీలో 30ఏళ్ల సీనియారిటీ ఉండడం కూడా శంకర్‌నాయక్‌కు కలిసొచ్చింది. శంకర్‌నాయక్ స్వగ్రామం నల్లగొండ జిల్లాలోని కేతావత్ తండా. డిగ్రీ పూర్తయిన వెంటనే యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన శంకర్‌నాయక్ రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించేవారు. సొంత మండలం దామరచర్ల నుంచి రెండు పర్యాయాలు జడ్పీటీసీ సభ్యుడిగా, ఒక పర్యాయం ఎంపీపీగా ఎన్నికయ్యారు. మూడు పర్యాయాలూ జనరల్ స్థానం నుంచే శంకర్‌నాయక్ ఎన్నికవడం రాజకీయాల్లో అప్పట్లో విశేషంగా చెప్పుకొన్నారు.

నామినేషన్ల దాఖలుకు నేడే ఆఖరు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు తుది గడువు సోమవారం సాయంత్రం 3 గంటలకు ముగియనుంది. ఇప్పటి దాకా 4 నామినేషన్లు దాఖలైనా.. వాటిలో ఒక్కటీ ప్రధాన పార్టీల నుంచి వచ్చినవి కావు. ఈ నామినేషన్లు.. స్క్రూటినీలో తిరస్కరణకు గురికావడం లాంఛనమే. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బీజేపీ, ఎంఐఎం పార్టీలకు అభ్యర్థులను ప్రతిపాదించేంత సంఖ్యలో ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఆ రెండు పార్టీలూ తమ అభ్యర్థులను రంగంలోకి దింపే అవకాశం లేదు. బీజేపీ.. తన అభ్యర్థిని రంగంలోకి దించాలంటే బీఆర్ఎస్ మద్దతు తీసుకోవడం ఒక్కటే మార్గం. అయితే బీఆర్ఎస్ మద్దతు తీసుకునే ప్రసక్తే ఉండదంటూ బీజేపీ నేతలు చెబుతున్నారు. ఇక ఎంఐఎం తన అభ్యర్థిని రంగంలోకి దింపాలంటే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఒకరి మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులను ప్రకటించి, ఒకటి సీపీఐకి ఇవ్వడంతో ఆ పార్టీ మద్దతు ఎంఐఎంకు లభించే అవకాశం లేదు.

ఈడీ వర్సెస్ సీఐడీ!

-మొదటిపేజీ తరువాయి

తేల్చారు. కేసును సీఐడీకి బదిలీ చేశారు. ఇప్పుడు ఈ కేసు హాట్‌టాపిక్‌గా మారింది. సరైన ఆధారాల్లేనందున కేసును మూసివేయాలంటూ సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) గత ఏడాది అక్టోబరులో ఎల్‌బీనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విషయం తెలుసుకున్న ఈడీ.. సీఐడీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 5న ప్రొటెస్ట్ పిటిషన్ వేసింది. "ఈ కేసులో ఇప్పటికే రెండు దఫాలుగా రూ.124.79 కోట్ల ఆస్తులను అటాచ్ చేశాం. అవన్నీ నిందితులైన కంపెనీ ప్రమోటర్లు, ఫండ్ రెగ్యులేటర్లు అయిన లండన్‌కు చెందిన అరుణ్ పంచారియా, దుబాయ్‌కి చెందిన సంజయ్ అగర్వాల్, హైదరాబాద్‌లో నివసించే ఎం.శ్రీనివాసరెడ్డి, ఎం.మల్లారెడ్డిలకు సంబంధించిన ఆస్తులు" అని ప్రొటెస్ట్ పిటిషన్‌లో ఈడీ స్పష్టం చేసింది. నేరాన్ని నిరూపించేందుకు అన్ని ఆధారాలున్నాయని, నిందితులు ఫెమా నిబంధనలను ఉల్లంఘించారనడానికి సాక్ష్యాలున్నాయని పేర్కొంది. ఇప్పటికే ఫార్మెక్స్ ఇండియా ఆర్థిక సలహాదారు అగర్వాల్‌తోపాటు.. పలువురిని అరెస్టు చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సైతం సీఐడీ నిర్ణయంపై విస్మయం వ్యక్తం చేస్తూ, ఫార్మెక్స్ ఇండియా కేసును మళ్లీ తెరవాలని.. తెలంగాణ డీజీపీకి లేఖ రాశారు. ఒక కేసుకు సంబంధించి ఇన్ని విభాగాల మధ్య విభేదాలుండడం ఇదే మొదటిసారి..!

నిర్ధారించిన సెబీ

సెబీ కూడా 2020 జూలై 15న జీడీఆర్ మోసాన్ని నిర్ధారిస్తూ తీర్పునిచ్చింది. ఫార్మెక్స్ ఇండియా సంస్థ మోసపూరితంగా వ్యవహరించి జీడీఆర్‌లను దుర్వినియోగం చేసిందనీ, షెల్ కంపెనీల ద్వారా లావాదేవీలు జరిగాయని స్పష్టం చేసింది. ఈ కంపెనీని స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాల్లో పాల్గొనకుండా నిషేధించింది. కంపెనీ డైరక్టర్లు ఎం.శ్రీనివాసరెడ్డి, అరుణ్ పచారియా, వింటేజ్ ఎఫ్‌జడ్‌ఈలు ఈ మోసానికి పాల్పడ్డారని తేల్చిచెబుతూ.. ఫార్మెక్స్ ఇండియాకు రూ.50 లక్షల జరిమానా విధించింది. సెబీ తన తీర్పులో పలు అంశాలను ప్రముఖంగా ఎత్తిచూపింది. అవి.. ఫార్మెక్స్ ఇండియా లిమిటెడ్(ఎఫఐఎల్) కంపెనీ 71.91 మిలియన్ విలువైన(నాటి విలువ రూ.370కోట్లు) 51 లక్షల జీడీఆర్‌లను జారీ చేసింది. వీటిని వింటేజ్ ఎఫ్‌జడ్‌ఈ సబ్‌స్క్రైబ్ చేసింది. ఆ తర్వాత వింటేజ్ కంపెనీ దుబాయ్‌లోని ఈరం బ్యాంకులో జీడీఆర్‌లను తనఖా పెట్టి.. రుణం తీసుకుంది. అరుణ్ పచారియా ఈ రుణాన్ని వివిధ కంపెనీలకు మళ్లించారు. దీనివల్ల ఎఫ్ఐఎల్, దాని షేర్ హోల్డర్లకు 72.20 మిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లింది. ఈ మోసపూరిత వ్యవహారంలో కేవలం ఎఫ్ఐఎల్, వింటేజ్ మాత్రమే కాకుండా ప్రాస్పెక్ట్ కాపిటల్ లిమిటెడ్, జాన్ బెహర్, నితీశ్ బన్‌గెరా, ఫండ్ మేనేజర్లు అయిన ఇండియా ఫోకస్ కార్డినల్ ఫండ్, హై బ్లూస్కై ఎమర్జింగ్ మార్కెట్ ఫండ్ పాత్ర ఉంది.

బీసీలు ఎదగకుండా అడ్డుకునే కుట్ర

హైదరాబాద్

రాష్ట్రంలో బీసీలు ఎదగకుండా, వారికి 42 శాతం రిజర్వేషన్లు అందకుండా ఆదిలోనే అడ్డుకునే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని.. దానితో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొన్నారు. దీనివల్లే ఆయా పార్టీల నేతలు లేనిపోని అపోహలు సృష్టించి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని.. ఆ ప్రయత్నాలను బీసీలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన 17వ అఖిల భారత పద్మశాలి, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే.. "రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సమాచారమంతా అధికారికంగా సేకరించినదే. ఇంటి యజమాని ధ్రువీకరణ కూడా తీసుకున్నాం. ఈ సర్వేలో బీసీల జనాభా 56.33 శాతం ఉన్నట్టు తేలింది. గతంలో కేసీఆర్ హయాంలో చేసిన సర్వేలో బీసీల జనాభా 51శాతమే లెక్కించారు. ఇప్పుడు 5.33 శాతం పెరిగింది. కేసీఆర్ సర్వేలో అగ్రకులాల జనాభా శాతం 21శాతం ఉన్నట్టు చెబితే.. మా సర్వేలో 15.28 శాతమేనని తేలింది. ప్రతి కోణంలో సర్వే చేసి గణాంకాలను క్రోడీకరించాం. అసెంబ్లీలో బిల్లు పెడతాం..: బీసీలకు ఇచ్చిన హామీలో భాగంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. త్వరలో అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తాం. పార్లమెంటులో ఈ బిల్లుకు ఆమోదం తెలిపిన వెంటనే రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి ఇవ్వడమంటే మోదీ మెడ మీద కత్తిపెట్టినట్టే. కచ్చితంగా మన డిమాండ్‌ను ఆమోదించాల్సిందే.

బీసీల కోసం ప్రజాప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వస్తే వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారనే భయం ప్రతిపక్ష పార్టీలకు పట్టుకుంది. బీసీలు ఎదిగితే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అందుకే బీసీ రిజర్వేషన్లను ఆ రెండు పార్టీలు ఆదిలోనే అడ్డుకునే కుట్ర చేస్తున్నాయి. ఈ పరిస్థితులను బీసీలంతా గుర్తించాలి.

నన్ను ఎప్పుడైనా కలవచ్చు..: తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతోనే ముఖ్యమంత్రి అయ్యాను. ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా కర్తవ్యం. అందుకోసం 24గంటలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాను. గత ప్రభుత్వంలో సీఎంను కలవాలంటే పెద్ద సాహసంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎప్పుడైనా నన్ను కలవచ్చు. మీ సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చి.. వాటిని పరిష్కరింపజేసుకునే బాధ్యత మీదే. తెలంగాణ సాధన కోసం పోరాడిన పద్మశాలి ముద్దు బిడ్డ కొండాలక్ష్మణ్ బాపూజీని పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రజాప్రభుత్వం ఏర్పాటు కాగానే.. కేంద్రంతో మాట్లాడి 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేశాం. దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడతాం. టైగర్ నరేంద్రకు యూపీఏ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇస్తే... ధృతరాష్ట్రుడి కౌగిలి మాదిరిగా కేసీఆర్ ఆయనను ఖతం చేశారు. కులవృత్తిపై ఆధారపడిన పద్మశాలీలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలను మహిళలు కట్టుకోలేదు. అవి పొలాల దగ్గర కట్టడానికే పనికి వచ్చాయి. అందుకే అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీ ఆపివేశాం. మహిళా సంఘాల్లోని వారికి మంచి చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. రూ.600 కోట్ల విలువైన 1.30 కోట్ల చీరల ఆర్డర్లను నేతన్నలకు ఇస్తున్నాం. తెలంగాణ పద్మశాలీలు ఇతర రాష్ట్రాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. రూ.కోటితో షోలాపూర్‌లో పద్మశాలీల ఆత్మగౌరవాన్ని నిలిపేలా మార్కండేయ భవనం నిర్మించేందుకు సహకరిస్తాం.." అని సీఎం రేవంత్ వెల్లడించారు.

చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేస్తున్నాం: మంత్రి తుమ్మల

రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ బడ్జెట్‌లోనే వారి రుణాలను మాఫీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజల కష్టాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పద్మశాలీలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు వినూత్న పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు.

మగ్గంపై చీర నేసిన సీఎం

సీఎం రేవంత్ తొలుత ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. అక్కడ సిద్ధం చేసిన చేనేత మగ్గంపై చీర నేశారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధా రాణి, అఖిలభారత పద్మశాలి సంఘం, తెలంగాణ పద్మశాలి సంఘం ప్రతినిధులు అంబటి శ్రీనివాస్, మురళీధర్, గడ్డం జగన్నా థం, కన్నెగట్ల స్వామి, టీపీసీసీ చేనేత విభాగం అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్, మచ్చ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరి జీవితంలో క్రీడలు ఏంతో ముఖ్యం:పల్లె గోపాల్ గౌడ్

గ్రామంలో పై చదువులు చదివే నిరుపేదలకు అండగా ఉంటా.
యువత చెడు అలవాటులకు దూరంగా ఉండాలి.కష్టపడి చదివితే జీవితంలో ఏదైనా సాధించవచ్చు
క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం క్రీడాలను స్నేహపూర్వకంగా ఆడాలి చదువుతో ఏదైనా సాధ్యం
పల్లె గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో పల్లె సుదర్శన్ గౌడ్ జ్ఞాపకర్థం క్రికెట్ టోర్నమెంట్.

ఇబ్రహీంపట్న09,మార్చి,(తెలంగాణ గీతం) నీత్యం బిజీగా ఉండే వారికీ క్రీడలు మానసికోల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని, పని ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె గోపాల్ గౌడ్ అన్నారు. తండ్రి కీర్తి. శే. సదర్శన్ గౌడ్ జ్ఞాపకర్థంగా...గత 45రోజులుగా నిర్వహిస్తున్న పల్లె ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -8ఆదివారం రోజున చివరి ఆట ఆడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజాన్ రెడ్డి హాజరై బాహుమతులు అందజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ లో 10జట్లు పాల్గొన్నగా ఇందులో మొదటి బహుమతి మహాత్మ యూత్ అసోసియేషన్ 46వేలు,గెలుపొందగా,రెండో బాహుమతి యువ చైత్యన్య యూత్ అసోసియేషన్ 28వేల బాహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా పల్లె గోపాల్ గౌడ్ మాట్లాడుతూ... యువతంటే మార్పును ఆశించే నవతరం. అవకాశాలను అందిపుచ్చుకొని భవితకు బాటలు వేసుకునే శక్తి. యువత తలుచుకుంటే ఏదైనా సాధించే ఆత్మవిశ్వాసం వారి సొంతం అవుతుందని. కొందరు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటుండగా మరికొందరు చెడు వ్యసనాలకు బానిసలై పెడదోవ పడుతున్నారు. ముఖ్యంగా యువత క్రీడలు ఆడే స్ఫూర్తి గొప్పదని, ప్రతిఒక్కరూ ఆటలు

ఆడుతూ మానసిక, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆటల్లో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతిరోజు చదువుకునే వారికి ఆటవిడుపుగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడంతో వారిలో నూతనోత్తేజాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజాన్ రెడ్డి ముఖ్య అతిధులుగా గెలుపొందిన వారికి బాహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఏస్ సీనియర్ నాయకులు కోరె జంగయ్య, రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రజిని కాంత్, పాండు రంగారెడ్డి, రవి గ్రామ పెద్దలు,రవి గౌడ్,యువకులు ప్రవీణ్ గౌడ్, మల్లేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఏస్‌లో బిఏస్పీ నాయకులు చేరిక

హయత్ నగర్ 09,తెలంగాణ గీతం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం బండరావిరాల గ్రామానికి చెందిన పలువురు బిఎస్పి పార్టీకి చెందిన ముఖ్య నాయకులు,కార్యకర్తలు బిఆర్ఏస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరుగ్యారంటీల్లో ఏ ఒక్కహామీ నెరవేరలేదని రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడుతున్నారని,మళ్ళీ రాష్ట్రప్రజలు కేసీఆర్ రాజ్యమే కావాలంటు కోరుతున్నారని,రాబోయేది మళ్ళీ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వవే అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఏస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాహన దారులు జాగ్రత్త

ఇబ్రహీంపట్నం09,తెలంగాణ గీతం: ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లి నుండి బ్రాహ్మణపల్లి వెళ్లె కోహెడ ఎక్స్ రోడ్ లో ఉన్నా నిర్మానుష్య ప్రాంతంలోకి కలకృత్యలకులేదా ఇంకేదైనా అవసరాల కోసం అటువైపు వెళ్లొదంటు ఆ ప్రాంతంలో గుర్తుతేలియని వ్యక్తులు దారికి అడ్డంగా వచ్చి దాడి చేసి విలువైన వస్తువులు దొంగలించుకొని పోతున్నారని,కావున వాహనాదారులు జాగ్రత్తగా అప్రమతంగా ఉండాలని ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వేంటనే 100కి ఫోన్ చేసీ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం పోలీసులు కోరారు.

గుర్తుకొస్తున్నాయి..

23.ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం09,మార్చి, తెలంగాణ గీతం: ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తను చదువుకునే రోజులు... చేసే అల్లరి... స్నేహితుల కోసం చేసే ఫైటింగ్లు...చినిగిన లాగులు... ప్యారాగన్ చెప్పులు,పాఠశాలల్లో కలిసి ఆడిన ఆటలు... చిన్న చిన్న గ్యాంగ్?లు...అవన్నీ ఓ మధురమైన క్షణాలు.మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 23 ఏడేళ్ల తర్వాత కలుసుకుని ఆనందంగా గడిపారు....ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. 2002-2003 (పదవ తరగతి) విద్యా సంవత్సరం నాటి పూర్వపు విద్యార్థులు ఇరువైమూడు ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకుని ఆనందంగా గడిపారు. వాట్సప్ వేదికగా గత మూడు నెలల నుంచి మిత్రులందరూ ఒకరినొకరు పరిచయం చేసుకుని ఈ కార్యక్రమం నిర్వహించుకున్నారు. అప్పట్లో వారికి విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఒకరోజు ముందుగానే గ్రామాలకు చేరుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ సంతోషంగా గడిపారు. వారు చదువుకున్న రోజుల్లో కొన్ని మధుర జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగప్ప, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, వేణుగోపాల్, బాలరాజ్, డేవిడ్, అబ్బయ్య,శేఖర్, బాలయ్య, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేసిన పదవ తరగతి స్నేహితులు

నారాయణ పురం09,తెలంగాణ గీతం: యాదాద్రి భువనగిరి సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రానికి చెందిన 2000-2001 జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి (బ్యాచ్)స్నేహితులు కలిసి తోటి స్నేహితురాలు సునీత భర్త అకాల మరణించిన విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి యాభై ఏడువేల ఆరు వందల (57,600) రూపాయలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్న నాటి స్నేహాన్ని మరవలేక చదువుకున్న విద్యార్థులు మా పాఠశాలకు సంబంధించిన ఏ ఒక్కరికి ఏలాంటి సమస్యలో ఉన్న తోటి స్నేహితులమైన మా సహాయ సహకారలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ,మహేశ్వరి, జయ కిషోర్,రాజు,మురళి, బాలరాజు,కిరణ్,బాలకృష్ణ, మహేష్ శంకర్ వెంకటేష్ రవి,శ్రవణ్,రమేష్,ధనంజయ్, ప్రతాప్,భాను,భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమంలో సురమోని సత్యనారాయణ పాత్ర ఎనలేనిది

తెలంగాణ ఉద్యమంలో వార్తలు చేరవేయడంలో ముఖ్యపాత్ర
నేడు టి.యు.డబ్ల్యూ.జె143 నియోజకవర్గ అధ్యక్షుడు,
సురమోని సత్యనారాయణ జన్మదిన శుభాకాంక్షలు

ఇబ్రహీంపట్నం,09,మార్చి, తెలంగాణ గీతం: జర్నలిజం అనేది ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని అన్నారు. అందరం కలిసి పనిచేసినప్పుడే ప్రజలకు మేలు చేయగలుగుతామని టి.యు. డబ్ల్యూ జే (143) ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు సురమోని సత్యనారాయణ అన్నారు.వార్తల సేకరణలో వాటిని ప్రచురించడంలో జర్నలిస్టుల కృషి మరువలేనిదని, ప్రతి జర్నలిస్టుకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో స్థానిక మాజీ ఏమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయటానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రతి మండలంలో యూనియన్ ప్రెస్‌క్లబ్‌లు ఏర్పాటుకు కృషి చేసామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తూ వారికి అండగా ప్రభుత్వంతోపాటు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఉందన్నారు. టీయూడబ్ల్యూజే యూనియన్ ఏర్పడిన అనతి కాలంలోనే జర్నలిస్టులకు పింఛన్లు, వారి పిల్లలకు పాఠశాల ఫీజులల్లో రాయితీ, వివిధ కారణాలతో మృతి చెందిన ప్రతి జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసి ప్రత్యేక పాత్ర పోషించారు.అదేవిధంగా కరోనా మహమ్మారి కవళించి వేస్తున్న సమయంలో దాతల సహకారంతో సంఘం తరపున కరోనా బారిన పడిన జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు తగిన ఔషధాలు తగిన జాగ్రత్తలు తెలిపి జర్నలిస్టు సోదరులకు అండగా నిలిచారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం త్వరలోనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రతి సోదరునికి న్యాయం చేకూరేలా కృషి చేస్తానని చెప్పారు.

జిల్లా అధ్యక్షుడు,మాజీ ఏమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చొరవతో

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ బిఆర్ఏస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి గారి చోరువతో ప్లాట్లు వచ్చేలా కృషి చేశారు. రంగారెడ్డి జిల్లాలో లక్ష్మీ దేవరమ్మ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జర్నలిస్టుల మహాసభకు కరోనాతో మృతి చెందిన జర్నలిస్టుల పేరును నామకరణం చేసిన విషయంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. జర్నలిస్టులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తీర్చడంలో ముందుంటారు సురమోని సత్యనారాయణ. స్నేహశీలి, ఉప్పొంగిన ఉత్తేజంతో ఇలాగే ముందుకు సాగాలని కోరుతూ నేడు సురమోని సత్యనారాయణ జన్మదినం సందర్భంగా జర్నలిస్టు సంఘం సోదరుల తరఫున ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

సమాఖ్య పాలనకు పునర్విభజన సవాళ్లు

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, 1977లో రాజ్యాంగానికి 42వ సవరణ జరిగిన నాటి నుంచి, రాష్ట్రాల మెడపై ఒక కత్తిలా వేలాడుతోంది. రాజ్యాంగ అధికరణలు 81, 82 తేటతెల్లమైన భాషలో సుబోధకంగా ఉన్నాయి: 'ఒక పౌరుడు, ఒక ఓటు' అనే సూత్రాన్ని అవి చేర్చుకున్నాయి. లోక్‌సభ సభ్యుల సంఖ్య వివిధ రాష్ట్రాల నుంచి ప్రత్యక్ష ఎన్నిక విధానం ద్వారా ఎన్నికయ్యే సభ్యులు 530కి మించకూడదని, కేంద్ర పాలిత ప్రాంతాలు ఎన్నుకునే వారి సంఖ్య 20కి మించకూడదనే పరిమితులను రాజ్యాంగ అధికరణ నిర్దేశించింది. లోక్‌సభలో ప్రస్తుతం రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు 530 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికైనవారు 13 మంది ఉన్నారు. అధికరణ 81లోని నిబంధన 2(ఎ) ఇలా ఉంది: